నమస్తే తెలంగాణ
# జిందగీ
హైదరాబాద్ | ఆదివారం 1 సెప్టెంబర్ 2024
www.ntnews.com
II



# అసలేం జరిగింది..

## ఐసీ 814: ద కాందహార్ హైజాక్

ఓటీటీ హిట్

**నెట్‌ఫ్లిక్స్:** స్ట్రీమింగ్ అవుతున్నది
**నటీనటులు:** విజయ్ వర్మ, నసీరుద్దీన్ షా, అరవింద స్వామి, కుముద్ మిశ్రా, రాజీవ్ ఠాకూర్
**దర్శకత్వం :** అనుభవ్ సిన్హా, త్రిశాంత్ శ్రీవాస్తవ

**1999లో** యావత్ ప్రపంచం ఉలిక్కిపడ్డ సంఘటన కాందహార్ హైజాక్. ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన పౌర విమానం నేపాల్ రాజధాని ఖాట్మండులో హైజాక్‌కు గురికావడం, కాందహార్‌కు చేరుకోవడం, ఉగ్రవాదుల డిమాండ్లు.. ఇవన్నీ ఓ సంచలనం. పాతికేండ్ల కిందట జరిగిన ఈ సంఘటన ఆధారంగా తెరకెక్కిన వెబ్‌సిరీస్ 'ఐసీ 814: ద కాందహార్ హైజాక్' ఇప్పుడు రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నది. వాస్తవిక కథను నిర్మించేటప్పుడు చాలా పరిధులు ఉంటాయి. కథ, పాత్రలు, సంభాషణలపై మరింత దృష్టి సారించాల్సి ఉంటుంది. ఏ మాత్రం అటూ ఇటూ అయినా.. ప్రజల మనోభావాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. వాస్తవాలు పక్కదారి పట్టిస్తే.. చరిత్ర కూడా క్షమించదు. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో పెట్టుకొని 'ఐసీ 814 : ద కాందహార్ హైజాక్' సిరీస్‌ను ప్రేక్షకుల ముందుకు తెచ్చారు దర్శకులు.

**కథ ఏంటంటే..?**
176 మంది ప్రయాణికులతో ఖాట్మండు నుంచి ఢిల్లీ బయలుదేరిన 'ఐసీ 814' విమానాన్ని ఉగ్రవాదులు హైజాక్ చేస్తారు. కెప్టెన్ తలపై తుపాకీ గురిపెట్టి విమానాన్ని కాబూల్‌కు తీసుకెళ్లాలని బెదిరింపులకు పాల్పడతారు. ఉగ్రవాదులు విమానాన్ని ఎందుకు హైజాక్ చేశారు? వాళ్ల డిమాండ్స్ ఏంటి? ఆ విమానం కాబూల్ ఎలా చేరింది? ఉగ్రవాదులు చేసిన డిమాండ్లను నెరవేర్చేందుకు భారత ప్రభుత్వానికి ఎదురైన ఇబ్బందులు ఏంటి? ప్రయాణికులను, విమాన సిబ్బందిని సర్కారు ఎలా కాపాడింది? అనేది మిగిలిన కథ. 'ఒకసారి నువ్వు తుపాకీ పట్టుకున్నావు అంటే.. ఒకరి ప్రాణం తీసేటప్పుడు వెయ్యిసార్లు ఆలోచించాలి. అదే ఒక ప్రాణం కాపాడటానికి ఆలోచించనక్కర్లేదు. రండి.. ఇది ప్రజలను కాపాడాల్సిన సమయం' సిరీస్ చివరి ఎపిసోడ్‌లో దేశానికి చెందిన ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య జరిగే సంభాషణ ఎమోషనల్‌గా ఉంటుంది. కెప్టెన్ దేవీశరణ్, శ్రింజయ్ చౌధురి రాసిన 'ఫ్లైట్ ఇన్ టూ ఫియర్' పుస్తకం ఆధారంగా కథను రాసుకున్నారు దర్శకులు. ఆరు ఎపిసోడ్లుగా దీనిని నిర్మించారు. ఒక్కో ఎపిసోడ్ నిడివి సుమారు 40 నిమిషాలు. వారాంతంలో మంచి కాలక్షేపం అని చెప్పొచ్చు.



## సమంత నాకు క్లోజ్



**సినిమాలతో** కంటే విభిన్నమైన డ్రెస్సింగ్‌తో పాపులారిటీ తెచ్చుకున్నది ఉర్ఫీ జావేద్. ఆమె లైఫ్‌స్టైల్ మిగిలిన నటులకన్నా భిన్నంగా ఉంటుంది. 'ఫాలో కర్‌లో యార్' టైటిల్‌తో ఆమె జీవిత కథ వెబ్ షోగా రూపొందింది. ఇది 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సిరీస్ ప్రమోషన్లలో బిజీగా ఉన్న ఉర్ఫీ.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో సమంత గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది. 'నేను చేసిన వీడియో నచ్చితే సమంత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తుంది. దీని వెనుక ఆమెకు ఎలాంటి ఉద్దేశం ఉందని అనుకోవడం లేదు. ఆమెతో ఇన్‌స్టాగ్రామ్‌లో పలుసార్లు మాట్లాడాను. సమంత, నేను స్నేహితులం' అని చెప్పుకొచ్చింది. అంతేకాదు, అర్జున్ కపూర్ అంటే తనకు చాలా ఇష్టమనీ, ఆయనపై ప్రేమ ఉందని కామెంట్ చేసింది. వెరైటీ డ్రెస్సులతో నిత్యం వార్తల్లో నిలిచే ఈ బ్యూటీ ముక్కుసూటిగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో రోజూ ట్రెండింగ్‌లో ఉంటుంది.

## నేను పబ్లిక్ ప్రాపర్టీని కాదు!

**సెలెబ్రిటీల** ప్రైవసీకి ఎప్పుడూ చిక్కే! పబ్లిక్ ఫిగర్ కావడంతో.. వాళ్లు పబ్లిక్‌లోకి రావడానికే జంకే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తాజాగా బాలీవుడ్ నటి తాప్సీకి ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఇటీవల ఓ పబ్లిక్ ప్లేస్‌లో తాప్సీ కనిపించింది. తెర మీద అలరించే నటి కండ్ల ముందు కనిపించేసరికి అక్కడి వారు ఫొటోలు, వీడియోలు తీయడానికి అత్యుత్సాహం ప్రదర్శించారు. 'వద్దు..' అని వారిస్తున్నా అభిమానులు వినకపోవడంతో తాప్సీ ఒకింత అసహనం వ్యక్తం చేసింది. 'నేను నటిని మాత్రమే. పబ్లిక్ ప్రాపర్టీని కాదు. రెండిటికీ చాలా తేడా ఉంది. కెమెరా పట్టుకుని నాపైకి రావడం, ఫిజికల్‌గా హ్యాండిల్ చేయడం చాలా తప్పు. ఎవరైనా నో చెబితే వారి అభిప్రాయానికి గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలి. ఇలా అంటున్నానని కొందరు నన్ను తప్పుగా అనుకోవచ్చు. అలాంటప్పుడు ఎందుకు హీరోయిన్‌గా చేస్తున్నావు అని ప్రశ్నించవచ్చు కూడా. కానీ నటన నాకు నచ్చిన వృత్తి. అందుకే సినిమాలు చేస్తున్నాను' అని చెప్పుకొచ్చింది తాప్సీ.



Re Release

# మళ్లీ విడుదల
# మీ అభిమాన థియేటర్‌లో

కాలయంత్రం పీఛేముడ్ అన్నది..
ఓ 22 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లింది..
ఫ్యాన్స్ బెనిఫిట్ షో మాదిరిగా..
అరుపులు.. విజిళ్లు.. కాగితాలు..
'ఇంద్ర' అని టైటిల్ పడగానే..
థియేటర్ దద్దరిల్లింది..
చక్రికి.. ఏం అర్థం కాలేదు.
టైమ్ ట్రావెల్‌లో 2002కి వెళ్లినట్టే ఉంది.
ఓ మూడు గంటలు.. సినిమా అయిపోయింది..
డోర్ తీసుకుని బయటికి వచ్చారు..
సెల్ఫీలు.. సినిమా గురించి ఫ్యాన్స్ ముచ్చట్లు.. రీల్స్..
ఫోన్‌లో చూస్తే.. #Rerelease పోస్టులు..
హ్యాపీ బర్త్ డే టు మెగాస్టార్ అని మెసేజ్‌లు..

**'రేయ్.. చక్రీ టైమ్ ఎంతరా?' 'పదిన్నర... ఎందుకు?' 'ఎందుకేంట్రా.. ఈ రోజు ఇంద్ర సినిమాకి వెళ్లాలి' 'ఏంట్రోయ్.. బుర్రలో చిప్ దొబ్బిందా? ఇది 2002 కాదు. 2024' 'అబ్బా చా.. మాకు తెలియదు మరి. నాతో రా..' అని బిట్టు బైక్ స్టార్ట్ చేశాడు. 15 నిమిషాల్లో థియేటర్‌కి వెళ్లిపోయారు.. బండి పార్కింగ్‌లో పెట్టేశారు.. 'రేయ్.. పద పదా.. ఇంద్ర ఎంట్రీ సీన్ మిస్ అవ్వకూడదు..' 'ఇంద్ర ఏంటి? పీవీఆర్‌లో ఈ పరుగులేంటి?' అని మనసులో అనుకుంటూ స్క్రీన్-2 డోర్ తీశాడు.. అంతే..**

**యస్..** ఒక్క చక్రికి మాత్రమే కాదు. తెలుగు సినిమా రీ-రిలీజ్ ట్రెండ్‌తో అందరు హీరోల ఫ్యాన్స్ టైమ్ ట్రావెల్ చేస్తున్నారు. అభిమాన హీరో సినిమాను మరోసారి.. 70 ఎంఎం స్క్రీన్‌పై చూస్తూ సందడి చేస్తున్నారు. అప్పటి కథల్లో మరోసారి తమ అభిమాన హీరోను తనివితీరా చూసుకుంటున్నారు.. వాళ్ల నటనకు మురిసిపోతున్నారు.. స్టెప్పులకు సలామ్ చేస్తున్నారు. మరైతే.. రీ-రిలీజ్ ట్రెండ్‌తో రిఫ్రెష్ అవుతున్న ఫ్యాన్స్ మూవ్‌మెంట్స్ వెనకున్న ముచ్చట్లు.. అలనాటి ఆల్‌టైమ్ హిట్స్ వెనకున్న సంగతులు.. సక్సెస్ ఫార్ములాలు ఏమై ఉంటాయి? ఈ రీ-రిలీజ్‌లను నేటి తరం ఎలా ఎంజాయ్ చేస్తున్నారు? ఇప్పుడు తీస్తున్న సినిమాలు మరో 20 ఏండ్ల తర్వాత మళ్లీ విడుదల అవుతాయా? రండి.. ఓ సారి ఈ రీ-రిలీజ్ సంగతుల్ని రీకాల్ చేసుకుందాం.

### సినిమా మారదు.. కథలే మారేది

నిడివి ఎంతైనా.. భాష ఏదైనా.. హీరోలు.. డైరెక్టర్లు ఎవరైనా.. సినిమా కోసమే తపిస్తారు. సో.. సినిమా అదే! కథలు.. పాత్రలే మారాయ్.. మారుతున్నాయ్!! కొత్త నటులూ పుట్టుకొచ్చారు. ఇదే మాదిరిగా.. ప్రేక్షకులూ మారరు! మారేది వాళ్ల ఎమోషన్లే. కొన్నిసార్లు సినిమాలకు సంబంధించిన డిస్కషన్స్‌లో 'ప్రేక్షకులు మారిపోయారు' అనడం వింటుంటాం. అలా మారిపోతే.. రీ-రిలీజ్ సినిమాలను ఇంతలా ఆదరిస్తారా? కచ్చితంగా కన్నెత్తి పోస్టర్ కూడా చూడరు!! దశాబ్దాలు దాటిపోయినా.. పుష్కరాలు గడిచిపోయినా.. అలనాటి ప్రేక్షకుడిని అప్పటి కథలు.. పాత ఆవకాయలా ఊరిస్తూనే ఉంటాయి. ఇప్పటి తరానికి కొత్త ఆవకాయలా ఆ పాత పరిమళాల్ని వెదజల్లుతూ ఉంటాయి. మన తెలుగు హీరోలు.. అమ్మ.. ఆవకాయ.. ఎప్పుడూ బోర్ కొట్టే ప్రసక్తే లేదు. అందుకే.. రీ-రిలీజుల్లో ఆ జోష్!!! చిరు స్టెప్పేసినా.. బాలయ్య డైలాగ్ చెప్పినా.. పవర్ స్టార్ ఫైట్ చేసినా.. నాగార్జున స్టైల్ చూపినా.. మహేష్ బాబు ముద్దొచ్చేలా యాక్ట్ చేసినా.. ఫ్యాన్స్‌కి పూనకాలే. అంతేనా.. నేటి టెక్నాలజీని వాడుకుని 4కే హంగులు, డాల్బీ మిక్సింగ్‌లు జోడిస్తూ.. అలనాటి సినిమాల్ని ఇప్పటి సిల్వర్ స్క్రీన్‌కి మ్యాచ్ చేస్తున్నారు. ఇక సినిమా లవర్స్‌కి పండుగే కదా!!

### తీసేవారికి పాఠం.. చూసేవారికి సినిమా!

ఒక సినిమా తీయాలంటే ఓ డైరెక్టర్ కొన్నేండ్లపాటు 24 క్రాఫ్టులను చదవాలి. అసిస్టెంట్‌గా మొదలెట్టి.. అసోసియేట్‌గా ఐదారు సినిమాలకు పనిచేయాలి. ఇక హీరోలైతే చాలానే చేయాలి. లేనివి అలవర్చుకోవాలి.. ఉన్నవి మెరుగుపరుచుకోవాలి. ప్రొడ్యూసర్ల పరిస్థితి చెప్పడానికి మాటలు సరిపోవు.. కుటుంబాల్ని.. ఆస్తుల్ని పణంగా పెట్టడమే! ఎన్నో మార్పులు, చేర్పులు.. నిద్రలేని రాత్రులు గడపాలి. ఇవన్నీ కుదిరితే హిట్ పక్కా! అలా కుదిరిన సినిమానే 'ఇంద్ర'. మెగాస్టార్‌కి మర్చిపోలేని కమర్షియల్ హిట్. కథా రచయితలు, డైలాగ్ రైటర్లు, డైరెక్టర్, మ్యూజిక్ డైరెక్టర్, ప్రొడ్యూసర్.. అనుభవాలు నేటి తరం ఫిల్మ్ మేకర్లకు పాఠాలు. రీ-రిలీజ్ ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర బృందం ఇంటర్వ్యూలు చూస్తే ఎవరికైనా అదే అనిపిస్తుంది. అప్పట్లో సినిమాల్ని అంత త్వరగా ఎలా ఫినిష్ చేసేవాళ్లు.. అప్పుడున్న టెక్నాలజీ సినిమాకి ఎలా హెల్ప్ అయ్యింది.. లాంటి వివరాల్ని వెటరన్ ఫిల్మ్ పండితులు చెబుతుంటే నేటి తరానికి ఆశ్చర్యం కలుగుతున్నది. కొన్ని వందల సినిమాలకు కథలు, మాటలు రాసిన పరుచూరి బ్రదర్స్ చిరంజీవి సక్సెస్ గురించి చెబుతూ ఖైదీ సినిమాలోని డైలాగ్ గుర్తుచేశారు.. 'కోటిపల్లికి దారేటని.. కొండపల్లి వెళ్తున్నావ్' అని రంగనాథ్ అడిగితే.. చిరంజీవి 'మనసు మార్చుకున్నా' అని చెబుతాడు. 'మీరు నటుడు అవుదాం అని వచ్చి.. మనసు మార్చుకుని మహానటుడు అయ్యారు' అని పరుచూరి వెంకటేశ్వరరావు చెప్పడం ఎంతో పరిపూర్ణమైన కాంప్లిమెంట్.

### అప్పుడు కాదు.. ఇప్పుడు నచ్చుతున్నాయ్

డైరెక్టర్.. హీరో.. ప్రొడ్యూసర్.. ఈ ముగ్గురి చొరవతోనే కథ ఓకే అవుతుంది. సినిమా పూర్తవుతుంది. ప్రమోషన్స్‌కి ప్రాణం పెడతారు. హిట్టు కొట్టేస్తున్నాం అని నమ్ముతారు. కానీ, రిజల్ట్ తేడా వస్తుంది. అలా హిట్ అనుకున్నవి అప్పుడు ఫట్ అయినవి ఎన్నో. కానీ, ఈ రీ-రిలీజ్ ట్రెండ్‌తో మళ్లీ విడుదలై ప్రేక్షకుల్ని థియేటర్‌కు రప్పించి.. మెప్పించిన సినిమాలు కొన్ని ఉన్నాయి. వాటిలో రామ్‌చరణ్ 'ఆరెంజ్' మొదటి వరుసలో ఉంటుంది. గత ఏడాది చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా మళ్లీ విడుదలైంది. ఈ దఫా సినిమాలో పాటలే కాదు.. కథ కూడా నేటి తరానికి బాగా కనెక్ట్ అయ్యింది. నిజానికి 'ఆరెంజ్' స్టోరీలైన్ ఇప్పటితరానిదే. పుష్కరకాలానికి ముందే పుట్టేసి కాస్త కన్ఫ్యూజ్ క్రియేట్ చేసింది. ఇంకా చెప్పాలంటే.. ఈ ఏడాది ప్రేమికుల రోజు సందర్భంగా 'ఓయ్' సినిమా రీ-రిలీజ్ అయింది. లవర్‌బాయ్ ఇమేజ్‌తో ఫుల్‌స్వింగ్‌లో ఉన్న సిద్ధార్థ్‌కి 'ఓయ్' ఊహించని ట్విస్ట్ ఇచ్చింది. విషాదాంత చిత్రాలను మరచిపోయిన తెలుగు ప్రేక్షకులు ఆ సినిమాలో కథానాయిక కన్నుమూయడాన్ని అప్పుడు జీర్ణించుకోలేకపోయారు. దాదాపు 14 ఏండ్ల తర్వాత మళ్లీ విడుదలైన 'ఓయ్'ని నేటితరం ప్రేమపక్షులు ఎగబడి చూశారు. మ్యూజిక్‌ను ఎంజాయ్ చేశారు. కథను యాక్సెప్ట్ చేశారు.





### గుర్తుకొస్తున్నాయి!!

వారానికో ట్రెండ్ మారుతున్న ఫ్యాషన్ ప్రపంచంలో ఉన్నాం మనం. అయినా.. ఎప్పుడో 23 ఏండ్ల కిందట పవన్ కళ్యాణ్ వేసుకున్న ఖుషి బ్యాగ్‌లు ఎవరికి గుర్తున్నాయ్? 2కేలో.. టీనేజ్ ప్రాయంలో ఆ బ్యాగులు.. చెవిలో వాక్‌మ్యాన్ ఇయర్ ఫోన్లు పెట్టుకుని.. 'ఆడువారి మాటలకూ.. అర్థాలే వేరులే..' అని గడిపిన రోజులు.. రీ-రిలీజ్‌తో మరోసారి కండ్లముందుకు వచ్చాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అయితే.. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్టుగా.. నేటి తరాన్ని అప్పటి నటుల మేనరిజం, వారి తాలూకు స్టైల్స్ కచ్చితంగా ఆకట్టుకుంటాయి. కావాలంటే.. మురారి సినిమాలో మహేష్‌బాబుకి ఇప్పటి మహేష్‌కి తేడాని చాలా స్పష్టంగా చూడొచ్చు. ఇంకా చెప్పాలంటే.. డైరెక్టర్ కృష్ణవంశీ మేకింగ్ స్టైల్ ఈ జనరేషన్ ఫిల్మ్ మేకర్స్‌కి 'మురారి' ఓ క్లాసిక్‌గా చెప్పొచ్చు. ముఖ్యంగా.. 'అలనాటి బాల చంద్రుడి..' పాట లేని పెండ్లి ఆల్బమ్ ఉండదేమో!!

### ట్రెండ్ కంటిన్యూ..!

కరోనా కారణంగానో.. భారీ సినిమాల షెడ్యూల్స్ వల్లో.. హీరోల నిర్ణయాల వల్లో.. నెలలు, ఏళ్ల గ్యాప్‌ని ఫిల్ చేయడానికి కూడా రీ-రిలీజ్‌లు శుభపరిణామం అనొచ్చు. దేశ, విదేశాల్లోని అభిమానులు.. ఈ రీ-రిలీజ్‌లతో రిఫ్రెష్ అవుతున్నారు. ఎప్పటినుంచో పవన్ కళ్యాణ్ సినిమాని థియేటర్లలో చూడాలని ఎదురుచూస్తున్న అభిమానులకు 'గబ్బర్ సింగ్' రీ-రిలీజ్‌కి సిద్ధం అవుతున్నది. పవన్ బర్త్ డే సందర్భంగా సెప్టెంబర్ 2న థియేటర్లలోకి వస్తున్నది. ఈ మళ్లీ విడుదలలు కేవలం తెలుగు సినిమాకు మాత్రమే పరిమితం కాదు. దేశంలోని వివిధ భాషల్లోనూ ఈ ట్రెండ్ కనిపిస్తున్నది. అంతేకాకుండా, కొన్ని సినిమాలకు రీ-రిలీజ్ తర్వాత వచ్చిన వసూళ్లు, అవి మొదటిసారి విడుదలైనప్పుడు వచ్చిన వసూళ్ల కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. టాలీవుడ్‌లో రీ-రిలీజ్‌లు ఇప్పుడో కొత్త ధోరణి. ఇది కేవలం సినిమాను మరోసారి చూడటం మాత్రమే కాదు, తెలుగు సినీ సంస్కృతిని కాపాడటం, పరిరక్షించడం కోసం చేసే ప్రయత్నం. భవిష్యత్తులో మరెన్నో క్లాసిక్ సినిమాలు రీ-రిలీజ్ ద్వారా ప్రేక్షకుల ముందుకు వస్తాయని ఆశిద్దాం.

> ### “ రీ-రిలీజ్‌లో టాప్ కలెక్షన్లు ”
> రీ-రిలీజ్‌లో పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన 'ఖుషీ' మూవీ మంచి వసూళ్లనే సాధించింది. మొదటి రోజు రూ.4.51 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. ఓవరాల్‌గా రూ.7.46 కోట్ల గ్రాస్ రాబట్టి రీ-రిలీజ్ చిత్రాల్లో అత్యధిక వసూళ్లను సాధించిన సినిమాగా రికార్డు సాధించింది. సూపర్ స్టార్ మహేష్‌బాబు హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'బిజినెస్ మేన్' మళ్లీ విడుదలలో మొదటిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.5.3 కోట్ల గ్రాస్ కొల్లగొట్టింది. ఎన్టీఆర్, రాజమౌళి కాంబోలో వచ్చిన 'సింహాద్రి' రీ-రిలీజ్‌లో ఫస్ట్ డే రూ.4.01 కోట్లు రాబట్టింది. చిన్న సినిమానే అయినా.. విశ్వక్‌సేన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'ఈ నగరానికి ఏమైంది' రీ-రిలీజ్‌లో రూ.1.78 కోట్లు కలెక్ట్ చేసింది.

**మొత్తంగా** రీ-రిలీజ్ ట్రెండ్ ముదిరి పాకాన పడుతున్నది. స్టార్‌హీరోల పుట్టినరోజు సందర్భంగా... వాళ్లు నటించిన పాత సినిమాలు కొత్తగా మళ్లీ విడుదల అవుతున్నాయి. విజయం సాధిస్తున్నాయి. నోస్టాలజీకి జీ హుజూర్ అనే వెటరన్లు, ఆ పాత సినిమాలో ఏముందో చూద్దాం అనుకునే యంగ్ ప్రేక్షకులు.. అందరూ 'మళ్లీ విడుదల' అనగానే 'చూసేందుకు రెడీ' అని సిద్ధమవుతున్నారు.

... రాజేష్ యడ్ల